సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం ၊ 16 ၊ జూన్ ၊ 2023



ప్రభుత్వ బడికి క్యూ

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు జోరందుకున్నాయి. కొత్త విద్యార్థుల రాకతో పాఠశాలలు కళకళలాడుతున్నాయి. 8లో



విదేశీయుల యోగాసనాలు

అంతర్జాతీయ యోగా దిన వారోత్సవాలు విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)లో గురువారం ప్రారంభమయ్యాయి. 8లో

ఏషియన్ బీచ్ వాలీబాల్‌కు కృష్ణంరాజు, నరేష్



ఏషియన్ సీనియర్ బీచ్ వాలీబాల్ చాంపియన్ షిప్‌కు భారత్ తరపున ఏపీ వాలీబాల్ క్రీడాకారులు కృష్ణంరాజు, నరేష్ అర్హత సాధించారు. 8లో

న్యూస్‌రీల్

డయల్ యువర్ సీపీకి 26 ఫిర్యాదులు



కాలర్‌తో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి(విశాఖ దక్షిణ): డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే చట్టపరంగా పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి 26 మంది ఫోన్ చేసి సీపీకి ఫిర్యాదులు చేశారు. సీపీ త్రివిక్రమ్ వర్మ ప్రతి ఒక్క కాలర్‌తో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వెంటనే ఆ ఫిర్యాదులను చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై డయల్ యువర్ సీపీ కార్యక్రమం ద్వారా స్వయంగా ఫిర్యాదు చేయాలంటే 0891–2523408 నెంబర్‌కు కాల్ చేయాలని సీపీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్, ఆటో ఎక్స్‌పో ప్రారంభం



వాహనాలను పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

ఏయూక్యాంపస్: విశాఖ ప్రజలు కొత్త దనాన్ని కోరుకుంటారని.. విశాఖ వేదికగా జరిగే వ్యాపార కార్యక్రమాలు పూర్తిస్థాయిలో విజయవంతమవుతాయని మేయర్ జి.హరి వెంకటకుమారి అన్నారు. ఏయూ పోలమాంబ మైదానంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్, ఆటో ఎక్స్‌పోను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన విద్యుత్ వాహనాలు, బైక్‌లు, కార్లు పరిశీలించారు. విశాఖ ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ్న వాహనాలను సంస్థలు అందుబాటులో ఉంచడం మంచి పరిణామమన్నారు. యూనికాన్ ఎక్స్‌పో నిర్వాహకుడు ఆర్.నాగ వెంకట గోపాలరావు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ వరకు ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎక్స్‌పో జరుగుతుందన్నారు. ఫుడ్ ఫెస్టివల్‌లో 100కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్‌లో విశాఖ అభిషేక్‌కి ఏడో ర్యాంకు



అభిషేక్

విశాఖ విద్య: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ ఎంట్రన్స్‌లో పీఎం పాలెంకు చెందిన డీ దేవ్ అభిషేక్ రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంకు సాధించాడు. బీటెక్ పూర్తి చేసిన అభిషేక్ రెండేళ్లపాటు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేశాడు. అయితే మేనేజ్‌మెంట్ రంగంలో మంచి అవకాశాలు దక్కించుకునేందుకు ఎంబీఏ కోర్సు అవసరాన్ని గుర్తించి ఎంట్రన్స్ పరీక్షకు సిద్ధమైనట్లు తెలిపాడు. మంచి ర్యాంకు సాధించిన అభిషేక్‌ను పలువురు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఆఈట్ రెండో దశ కౌన్సెలింగ్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెల్ఫ్ సపోర్ట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు రెండో దశ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ర్యాంకర్లు తమ సర్టిఫికెట్లను ఈ నెల 19వ తేదీ వరకు అప్‌లోడ్ చేయాలని ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని, ఈ నెల 27న సీట్ల కేటాయింపు చేయనున్నట్లు పేర్కొన్నారు. సీట్లు పొందిన వారు ఈ నెల 28 నుంచి జూలై 1వ తేదీ వరకు ఫీజు చెల్లించాలన్నారు.

30 లోగా ఆస్తి పన్ను చెల్లించండి

డాబాగార్డెన్స్: ఆస్తి పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఆస్తి పన్నుదారులకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. 2023–24 ఏడాదికి సంబంధించి తొలి క్వార్టర్ ఈ నెల 30తో ముగియనుందని, ఆస్తి పన్ను దారులు ఈ నెల 30లోగా మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లించి జీవీఎంసీకి సహకరించాలని కోరారు.

టార్గెట్.. మనీ

- ఎంపీ ఎంవీవీ సతీమణి, కుమారుడితో పాటు ఆడిటర్ జీవీ కిడ్నాప్
- ఒకరి ద్వారా మరొకరికి ఫోన్ చేయించి నిర్బంధం
- రూ.1.75 కోట్లు ఇచ్చినా కనికరించని కిడ్నాపర్ హేమంత్‌కుమార్
- ఇప్పటికే అతడిపై రెండు కిడ్నాప్ కేసులు.. ఇటీవలే బెయిల్‌పై విడుదల
- తాజాగా ఎంపీ ఫ్యామిలీ టార్గెట్.. కొత్త గ్యాంగ్‌తో కిడ్నాప్ వ్యవహారం
- రియల్ ఎస్టేట్ వ్యాపారి ముసుగులో నేర సామ్రాజ్యం విస్తరణ
- 4 గంటల్లోనే కిడ్నాపర్లను పట్టుకున్న పోలీసులు



కిడ్నాపర్లు ఉపయోగించిన కారు

దొండపర్తి(విశాఖ దక్షిణ): పక్కాగా స్కెచ్ వేశాడు. ఎంపీ నగరంలో ఉండరని తెలుసుకున్నాడు. అతని కుమారుడు ఇంట్లో ఒక్కడే ఉన్నట్లు గుర్తించాడు. అతడిని కిడ్నాప్ చేస్తే రూ.కోట్ల వర్షం కురుస్తుందని భావించాడు. ఇందుకోసం కొత్త గ్యాంగ్‌ను రంగంలోకి దింపాడు. అదును చూసి ఇంట్లోకి చొరబడ్డాడు. మెడపై కత్తి పెట్టి అతని తల్లికి.. ఆ తరువాత ఆమె ద్వారా ఎంపీ సన్నిహితుడు జీవీకి ఫోన్ చేయించి రప్పించి.. వారందరినీ ఇంట్లోనే 48 గంటల పాటు నిర్బంధించి డబ్బు కోసం దాడి చేశాడు. రూ.1.75 కోట్లు ఇచ్చినా ఇంకా కావాలని డిమాండ్ చేశాడు రౌడీషటర్ కోలా వెంకట హేమంత్ కుమార్. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ వ్యవహారం వెనుక హేమంత్‌కుమార్ ప్రీ ప్లాన్డ్‌గా వ్యవహరించినట్లు తెలుస్తోంది. పక్కాగా రెక్కీ నిర్వహించి.. కిడ్నాప్ కోసం ఒక కొత్త గ్యాంగ్‌ను సిద్ధం చేసుకొని.. వారితో పకడ్బందీగా ప్లాన్ చేసుకొని.. ఇంట్లో ఒకరే ఉన్న సమయం కోసం ఎదురుచూసి కిడ్నాప్‌కు పాల్పడ్డాడు. విషయం ఆలస్యంగా పోలీసుల దృష్టికి వెళ్లినప్పటికీ.. కేవలం నాలుగు గంటల్లోనే హేమంత్‌కుమార్ గ్యాంగ్‌కు చెక్‌పెట్టారు. కిడ్నాపర్ల చెర నుంచి ఎంపీ ఎంవీవీ ఫ్యామిలీని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ కేసులో పోలీసులు అనేక కోణాల్లో దర్యాప్తును చేపడుతున్నారు. ఇందులో మరో ఐదుగురి పాత్ర ఉన్నట్లు గుర్తించారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

12 కేసుల్లో సూత్రదారి..
ఎంపీ ఫ్యామిలీని టార్గెట్ చేసి..

భీమిలి ప్రాంతానికి చెందిన కోలా వెంకట హేమంత్ కుమార్‌పై 12 కేసులు ఉన్నాయి. గతంలో కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. అలాగే గత ఏడాదిలో రామకృష్ణ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసిన కేసులో అరెస్ట్ అయ్యాడు.

కొన్ని నెలల పాటు జైలులో ఉండి బయటకు వచ్చారు. వచ్చిన కొద్ది రోజుల్లోనే ఈ ఏడాది ఫిబ్రవరిలో మధుసూదనరావు అనే మరో రియల్‌ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేశాడు. అతడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేసి చివరకు రూ.12 లక్షలు కాజేశాడు. అయితే మధుసూదనరావు వారి చెర నుంచి తప్పించుకొని పోలీసులను ఆశ్రయించడంతో అప్పుడు కూడా గంటల వ్యవధిలోనే హేమంత్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. జైలు నుంచి ఇటీవలే బెయిల్‌పై విడుదలైన హేమంత్ తాజాగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఫ్యామిలీనే టార్గెట్ చేసుకున్నాడు.

సినీ ఫక్కీలో ఛేజింగ్



ముందు భాగం దెబ్బతిన్న పోలీసు వ్యాన్

ఆనందపురం : ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ **భార్య జ్యోతి, కుమారు**డు శరత్, ఆడిటర్ జి.వెంక**టేశ్వరరావులను కిడ్నాప్** చేసిన నిందితులు మండ**లంలోని పందలపాకలో** పట్టుబడడం సంచలనం **సృష్టించింది. మొదట** పోలీసులు వాహనాలతో **ఛేజింగ్ చేయడంతో** దొంగలను వెంటాడుతు**న్నారని అనుకున్న స్థా**నికులు.. తరువాత ఎంపీ **కుటుంబ సభ్యులను** కిడ్నాప్ చేసిన నిందితులని **తెలిసి విస్తుపోయారు.** ఈ సంఘటన మండలంలో పెను సంచలనమైంది. ఎంపీ ఎంవీవీ భార్య జ్యోతి, కుమారుడు శరత్, ఆడిటర్ జి.వెంకటేశ్వరరావులను బంధించిన నిందితుల కారు ఆనందపురం వైపు వస్తుందని అందుకున్న సమాచారం మేరకు సీపీ త్రివిక్రమ్ వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటైన 15 బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మండలంలోని నీళ్ల కుండీలు, ఆనందపురం, పద్మనాభం, అనంతవరం, బాకురుపాలెం తదితర జంక్షన్ల వద్ద పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. ఎంవీవీ స్టిక్కర్‌తో గల ఆడికారు నీళ్లకుండీల గుండా పద్మనాభం వైపు వాయువేగంతో దూసుకుపోయింది. దీంతో అక్కడ ఆపేందుకు ప్రయత్నించిన పోలీసులు.. పద్మనాభం పోలీసులకు సమాచారం అందించారు. కాగా కిడ్నాపర్లు కారు బాకురుపాలెం క్వారీ సమీపంలోకి చేరుకునే సరికి టైరు పంక్చర్ అయింది. దీంతో నిందితులు కారును రోడ్డు పక్కన గల మార్గంలోకి తీసుకొని వెళ్లి టైరు మార్చారు. ఈలోగా నీళ్ల కుండీలు–పద్మనాభం రూట్లో పోలీసుల వాహనాలు సైరన్ మోగిస్తూ తిరుగుతుండడంతో కంగారు పడిన కిడ్నాపర్లు కిడ్నాప్ చేసిన ముగ్గురిని అక్కడే విడిచి పెట్టి కారుతో పరారయ్యారు. కారును గమనించిన పోలీసులు తమ వాహనాలతో వెంబడించారు. నిందితుల కారు బాకురుపాలెం వద్ద నుంచి ఎడమ వైపు మలుపు తిరిగి తర్లువాడ రోడ్‌లో ప్రవేశించింది. కారు పందలపాక జంక్షన్ సమీపంలోకి చేరుకునే సరికి ఎదురుగా పోలీసులు వాహనాలు వచ్చాయి. అయినా కిడ్నాపర్లు తమ కారును నిలుపుదల చేయలేదు. దీంతో పోలీసులు తెగించి ఎదురుగా వస్తున్న కిడ్నాపర్ల వాహనాన్ని తమ వాహనంతో ఢీకొట్టి నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో కారును కుడివైపు పొలాల్లోకి దింపి పరారు కావడానికి ప్రయత్నించగా ముందు టైర్లు పంక్చర్ అయ్యాయి. కొంత దూరం వెళ్లేటప్పటికి కారు తుప్పల్లో ఆగిపోయింది. దీంతో కారు దిగి నిందితులు పరారవుతుండగా పోలీసులు వెంబడించారు. ఈ లోగా స్థానికులు అక్కడకు చేరుకొని పట్టుకోవడానికి ప్రయత్నించగా నిందితులు కత్తితో బెదిరించారు. అయినా పోలీసులు, స్థానికులు వెంబడించి నిందితులు కోలా హేమంత్ కుమార్, రాజేష్‌ను పట్టుకున్నారు. వారిని ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీపీ త్రివిక్రమ్‌వర్మ, డీసీపీ–1 విద్యాసాగర్ నాయుడు, డీపీ–2 ఆనందరెడ్డి, క్రైం డీసీపీ గంగాధర్‌లు నిందితులను విచారించారు. పరారైన వారి కోసం గాలిస్తున్నారు. కిడ్నాపర్ల కారును నిలువరించే సమయంలో ఢీ కొట్టిన పోలీసు వాహనంలోని ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి.

ఎంపీకి కృష్ణయ్య పరామర్శ

రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య ఫోన్‌లో ఎంపీ ఎంవీవీని పరామర్శించారు. ఎంపీ ఎంవీవీని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికారి ప్రతినిధి కర్రి వేణుమాధవ్ కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రియల్ ఎస్టేట్ ముసుగులో నేర సామ్రాజ్యం



హేమంత్‌కుమార్

హేమంత్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తూ వస్తున్నాడు. తాను కూడా రియల్‌ఎస్టేట్ వ్యాపారినని అందరికీ పరిచయం చేసుకోవడం, వారితో కలిసి లావాదేవీలు చేస్తానని నమ్మించడం, చివరికి కిడ్నాప్‌లకు పాల్పడడం పరిపాటిగా మార్చుకున్నాడు. హేమంత్ గతంలో ఎంవీవీ బిల్డర్స్ కార్యాలయానికి వెళుతూ రియల్‌ఎస్టేట్ బుకింగ్స్ తీసుకువస్తానని అక్కడి సిబ్బందిని పరిచయం చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణకు నేరుగా పరిచయం లేన్నట్లు ఆ కార్యాలయం వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఒక మహిళతో సన్నిహితంగా ఉంటూ ఆమె ద్వారా రియల్‌ఎస్టేట్ అక్రమ లావాదేవీలే కాకుండా కిడ్నాప్ వ్యవహారాల్లో కూడా వచ్చే నగదును ఆమె ఖాతాల్లో జమ చేసినట్లు సమాచారం. గతంలో హేమంత్‌కుమార్‌తో పాటు సదరు మహిళను కూడా పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఇలా గత కొన్నాళ్లుగా అనేక మందిని బ్లాక్‌మెయిల్ చేయడం, మాట వినకపోతే కిడ్నాప్‌లకు పాల్పడడం చేస్తూ నేర సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నాడు.

కొత్త గ్యాంగ్‌తో కిడ్నాప్



జైలు నుంచి బయటకు వచ్చిన హేమంత్ కుమార్ ఈసారి రూ.లక్షల్లో కాకుండా రూ.కోట్లలో గడించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం ఎప్పటిలానే ఎవరినైనా కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నాడు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులనే టార్గెట్ చేస్తూ వస్తున్న హేమంత్‌కుమార్ ఈ సారి కూడా ఆ రంగంలో ఉన్న బిగ్‌షాట్ కోసం అన్వేషించాడు. ఈ క్రమంలో బిల్డర్‌గా, ఎంపీగా ఉన్న ఎం.వి.వి.సత్యనారాయణ కుటుంబ సభ్యుల వద్ద భారీగా డబ్బు ఉంటుందని భావించాడు. అయితే ఎంపీని కిడ్నాప్ చేయడం సాధ్యం కాదని భావించి రుషికొండ ప్రాంతంలో నివాసముంటున్న అతని కుమారుడు శరత్‌పై దృష్టి పెట్టాడు. ఇందుకోసం పక్కాగా రెక్కీ నిర్వహించి.. కొత్త గ్యాంగ్‌ను రంగంలోకి దింపి ఈ నెల 13వ తేదీ ఉదయం ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బంగారు నగలను దోచుకున్నారు. డబ్బు కోసం శరత్‌పై దాడి చేశారు. మరుసటి రోజు అతని తల్లి జ్యోతికి ఫోన్ చేయించి ఇంటికి రప్పించి ఆమె వద్ద ఉన్న బంగారాన్ని కాజేశారు. ఆమె ద్వారా ప్రముఖ ఆడిటర్ జీవీని పిలిపించి నిర్బంధించారు. డబ్బు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించడంతో జీవీ తన సహచరులు, స్నేహితుల నుంచి రూ.1.75 కోట్లు సమీకరించి హేమంత్‌కుమార్ గ్యాంగ్‌కు అందజేశారు. అయినప్పటికీ వారిని విడిచిపెట్టలేదు. ప్రతి కిడ్నాప్ కేసులోను బాధితులు అడిగినంత డబ్బు ఇచ్చినప్పటికీ హేమంత్‌కుమార్ వారిని విడిచిపెట్టకుండా హింసించడం చివరికి పోలీసులకు దొరికిపోతూ వచ్చాడు. ఇదే తరహాలో ఈ ముగ్గురి విషయంలోను ప్రవర్తించాడు. ఈ సారి పోలీసులకు చిక్కకుండా ప్లాన్ వేసి అక్కడి నుంచి పారిపోడానికి ప్రయత్నించినప్పటికీ.. పోలీసులు హేమంత్ గ్యాంగ్ ఎత్తులను చిత్తు చేశారు. 17 ప్రత్యేక బృందాలతో సినీ ఫక్కీలో ఛేజ్ చేసి ఆనందపురం మండలంలో హేమంత్ వెళ్లే కారుకు రెండు వైపులా పోలీస్ వాహనాలతో అడ్డుకొని పట్టుకున్నారు. అప్పటికే వేరే ప్రాంతంలో కిడ్నాపర్లు విడిచిపెట్టిన ఎంపీ భార్య, కుమారుడు, ఆడిటర్‌ను సురక్షితంగా కమిషనరేట్‌కు తీసుకువచ్చారు.

విద్యా ప్రమాణాల పెంపుతో ఉత్తమ ఫలితాలు



సదస్సు ప్రారంభిస్తున్న జేసీ విశ్వనాథన్, డీఈవో చంద్రకళ, ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్

జేసీ కె.ఎస్.విశ్వనాథన్



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఆరిలోవ: విద్యా ప్రమాణాలు మెరుగు పరుచుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. విశాఖ వేలీ స్కూల్‌లో గురువారం జీ20– ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఒక్క రోజు సదస్సు నిర్వహించారు. ముందుగా జేసీ, డీఈవో చంద్రకళ, పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ జ్యోతి ప్రజల్వన చేసి, సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సీబీఎస్‌సీ సిలబస్–విద్యా విధానంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. గతం, ప్రస్తుతం ఉన్న విద్యా ప్రమాణాలను పోల్చుతూ వివరించారు. ఎన్ఈపీ, ప్రాథమిక స్థాయిలో అక్షరాస్యత, జాతీయ విద్యా విధానం తదితర అంశాలపై వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ఆలపించిన గీతాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఉక్కునగరం డీపీఎస్ ప్రిన్సిపాల్ ఎస్.కె.పాండే, వాల్తేరు కేవీ ప్రిన్సిపాల్ మరల్జిత్, దువ్వాడ స్టీల్‌సిటీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వి.సుశీల, ఎస్‌టీఎల్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.శ్రీనివాసరావు, స్టోరీ టెల్లర్ ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్, శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రిన్సిపాల్ ఎ.కౌసల్య, టింపనీ, విజయం, నేవీ చిల్డ్రన్ స్కూల్, సీయూటీఎస్ స్కూల్, డిగ్నన్ వరల్డ్ వన్ స్కూల్, ప్రెసిడెన్షియల్ స్కూల్, అమేయ వరల్డ్ స్కూల్, శ్రీ చైతన్య టెక్నో, సిల్వర్ ఓక్స్, విజ్ఞాన వరల్డ్, తదితర పాఠశాలల నుంచి ప్రిన్సిపాళ్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎ.మల్లికార్జున, ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ ఈ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లపై ఫోకస్

- అనుమతులున్న కాలేజీల్లోనే విద్యార్థులు చేరాలి
- ప్రైవేటు కాలేజీల్లో తనిఖీలు కొనసాగుతాయి
- ఆన్‌లైన్ విధానంలోనే ఇంటర్మీడియట్ అడ్మిషన్లు
- 'సాక్షి'తో ఆర్ఐవో సత్యనారాయణ



సత్యనారాయణ

విశాఖ విద్య: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగేలా ప్రత్యేక ఫోకస్ పెట్టామని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో) రాయల సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన 'సాక్షి' తో మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ కాలేజీల నిర్వహణ, ప్రైవేటు కాలేజీల అనుమతుల విషయంలో తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు పెంచేలా ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియెట్ ప్రవేశాలు తప్పనిసరిగా ఆన్‌లైన్ విధానంలోనే చేపట్టాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మాత్రమే ఆన్‌లైన్ ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. పూర్తి స్థాయిలో అనుమతులు వచ్చిన తరువాతనే ప్రైవేటు కాలేజీల్లో అడ్మిషన్లు చేపట్టాలన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రైవేటు కాలేజీల్లో అడ్మిషన్ తీసుకునే సమయంలో తప్పనిసరిగా ఆ కాలేజీకి ప్రభుత్వ గుర్తింపు ఉందా..? లేదా అనేది పరిశీలన చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు కాలేజీల నిర్వహణకు అనుమతి ఇచ్చే క్రమంలో తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. జిల్లా కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాలకు అనుగుణంగా ఈ విషయంలో ముందుకెళ్తామన్నారు. నిబంధనలు అతిక్రమించే ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే కాలేజీ గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు.

న్యాయవాదుల బీమా గడువు పెంపు

విశాఖ లీగల్ : న్యాయవాదుల వైద్య బీమా పథకాన్ని ఈనెల 16వ తేదీ నుంచి నెలరోజులపాటు పొడిగించినట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్ తెలిపారు. ఇప్పటివరకు వైద్య బీమా పథకంలో సభ్యులుగా చేరని న్యాయవాదులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే బీమా సౌకర్యం వచ్చే నెల 4వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందన్నారు. మరిన్ని వివరాలకు విశాఖ న్యాయవాదుల సంఘం కార్యాలయం, హైకోర్టు బార్ కౌన్సిల్ కార్యాలయం లేదా తమను వ్యక్తిగతంగా సంప్రదించవచ్చని కృష్ణమోహన్ చెప్పారు.

జెడ్సీపై వార్డు కార్యదర్శి ఫిర్యాదు

- అసభ్యకర పదజాలంతో తిట్టారని ఆరోపణ

జగదాంబ: జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్‌పై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు 28వ వార్డు భానోజీనగర్ వార్డు సచివాలయం కార్యదర్శి కె.ఎస్.కె.వెస్లీ ఫిర్యాదు చేశారు. అసభ్యకర పదజాలంతో తిట్టారని, ఆయన వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత 31వ తేదీన జెడ్సీ కార్యాలయంలో ఈ ఘటన జరిగిందని.. అప్పటి నుంచి అవే మాటలు మనసులో మెదలడంతో ఈ నెల 7న కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెస్లీ తెలిపారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించానని, విధుల్లో ఎటువంటి రిమార్క్ లేదన్నారు. నా లాగ మిగతా కార్యదర్శులకు ఇలాంటి పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

882 కిలోల నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలతో ఉన్నతాధికారుల నుంచి వార్డు సచివాలయ కార్యదర్శుల వరకు గురువారం నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు నేతృత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పెద్ద ఎత్తున దాడులు జరిపింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ 8 జోన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి.. 5,964 దుకాణాల నుంచి 882.7 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దుకాణ యజమానుల నుంచి రూ.3,43,070 అపరాధ రుసుం కింద వసూలు చేసినట్లు వెల్లడించారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తూ మూడు సార్లు వరకు పట్టుబడితే జరిమానా వేస్తామని, ఆ తర్వాత పట్టుబడితే దుకాణానికి తాళం వేస్తామని హెచ్చరించారు.

స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో అద్వితీయ ప్రగతి

ఏయూ ఉపకులపతి ప్రసాదరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం అద్వితీయ ప్రగతి సాధిస్తోందని ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ సెనేట్ మందిరంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రారంభించిన తొలి ఏడాది కాలంలోనే 'ఎ హబ్' అనేక విజయాలు సాధించిందన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్‌లో ఏయూ 15వ స్థానంలో నిలిచిందన్నారు. ఇన్‌స్టిట్యూషనల్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో జాతీయ స్థాయిలో తొలి సంవత్సరమే 'ఎ హబ్' 4 స్టార్ రేటింగ్‌ను సొంతం చేసుకుందన్నారు. దేశ వ్యాప్తంగా కేవలం ఐదు సంస్థలు మాత్రమే 4 స్టార్ రేటింగ్‌ను సాధించాయని, అందులో ఏయూ ఒకటి కావడం గర్వకారణమన్నారు.

జాతీయ విద్యా సంస్థలైన ఐఐటీలతో పోటీ పడుతూ ఏయూ ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. 2024 చివరి నాటికి 200పైగా స్టార్టప్ సంస్థలు నెలకొల్పడం లక్ష్యంగా పని చేస్తున్నామని, ఇప్పటికే వందకు పైగా స్టార్టప్ సంస్థలు ఏయూ కేంద్రంగా పని చేస్తున్నాయన్నారు. టెక్ స్టార్టప్, ఫుడ్ ఇంక్యుబేషన్, ఫార్మా ఇంక్యుబేషన్, మెరైన్ ఇంక్యుబేషన్ వంటివి నెలకొల్పామని, త్వరలో ఇవి పూర్తిస్థాయిలో సేవలు ప్రారంభిస్తాయన్నారు. ఏయూ కేంద్రంగా పనిచేస్తున్న శాండ్ లాజిక్ సంస్థ చిప్ టెక్నాలజీపై పనిచేస్తోందన్నారు. దీనికి రూ.5కోట్లకు పైగా గ్రాంట్ లభించిందన్నారు. విద్య, వైద్య, రక్షణ, బ్యాంకింగ్ రంగాలకు ఉపయుక్తంగా ఏఐ ఆధారితంగా పనిచేసే చిప్‌ను అభివృద్ధి చేసే దిశగా ఈ సంస్థ పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు డి.కమలాకర్, రవికుమార్‌లను పరిచయం చేశారు. మరో అంకుర సంస్థ గ్రీన్ జామ్స్ సంస్థ పర్యావరణహిత ఇటుకలను తయారు చేస్తున్న విధానం వివరించారు. ఇప్పటికే ఈ సంస్థ 50 వేల అమెరికన్ డాలర్ల గ్రాంట్‌ను సాధించిందన్నారు. సంస్థ నిర్వాహకులు తరుణ్ జామిని పరిచయం చేశారు. తారమండల్ అనే సంస్థ ప్యారిస్ పీస్ ఫౌండేషన్‌తో కలసి పనిచేసే అవకాశం సాధించిందన్నారు. దేశం నుంచి ప్యారిస్ పీస్ ఫౌండేషన్‌తో కలసి పని చేస్తున్న నాల్గో సంస్థగా తారమండల్ నిలుస్తుందని సంస్థ వ్యవస్థాపకుడు విసీల్ జడ్సన్‌ను అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు తదితరులు ప్రసంగించారు.

విమానాశ్రయ అభివృద్ధికి కృషి చేస్తా

ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజారెడ్డి



విశాఖ విమానాశ్రయం గత డైరెక్టర్ శ్రీనివాసరావుతో నూతన డైరెక్టర్ రాజారెడ్డి

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎయిర్ పోర్టు నూతన డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి అన్నారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌గా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. విశాఖ విమానాశ్రయంలో గతంలో పనిచేసిన అనుభవం ఇప్పుడు దోహదపడుతుందన్నారు. 2009 నుంచి 2015 వరకు ఆపరేషన్స్ విభాగంలో ఇక్కడ పని చేశానని గుర్తు చేశారు. హుద్‌హుద్ తుపాను సమయంలో ఇక్కడే ఉన్నానని చెప్పారు. విశాఖపట్నం కార్గో రవాణాకు అనుకూలమని.. దీన్ని విశాఖ విమానాశ్రయం అందిపుచ్చునేలా కృషి చేస్తానన్నారు. విదేశీ విమానాల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపడతానన్నారు. గతంలో కంటే విమానాశ్రయంలో సౌకర్యాలు మెరుగుపడ్డాయని, ఇందుకు అనుగుణంగా ఎయిర్ ట్రాఫిక్ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గత డైరెక్టర్ శ్రీనివాసరావు సలహాలు తనకు ఉపయోగపడతాయని, కార్గోలో ఉన్న పలు సమస్యలను ఆయన వివరించారని చెప్పారు. విమానాశ్రయంలో ఏఏ రంగాల్లో అభివృద్ధి చేయాలో అవగాహన ఉందన్నారు. కాగా.. ఎస్.రాజారెడ్డి 1995లో ఎయిర్‌పోర్టు డిపార్ట్‌మెంట్‌లో చేరారు. పలు ర్యాంకుల్లో పని చేశారు. 2009 నుంచి 2015 వరకు ఇక్కడే విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత మహారాష్ట్రలోని గోండియా విమానాశ్రయం, చెన్నై, ఢిల్లీ విమానాశ్రయాల్లో పని చేశారు. ఢిల్లీ నుంచి బదిలీపై వచ్చిన ఆయన విశాఖ ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌గా విధుల్లో చేరారు.

తూర్పు నావికాదళంలో యోగాసనాలు


యోగసనాల్లో పాల్గొన్న నౌకాదళ సిబ్బంది

విశాఖ విద్య : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో గురువారం విశాఖపట్నం, భీమునిపట్నంలో ప్రత్యేక యోగా శిబిరం నిర్వహించారు. యెగా సాధన ద్వారా కలిగే ఉపయోగాలను యోగా గురువులు వివరించారు. భీమునిపట్నంలో నిర్వహించిన శిబిరంలో నావికా దళ సిబ్బందితో పాటు, నావిక దళ సిబ్బంది, మహిళలు సైతం ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అదే విధంగా యారాడలో ప్రజలకు యోగాసనాలపై అవగాహన కలిగించారు.

విదేశీయుల యోగాసనాలు


యోగాసనాలు సాధన చేస్తున్న విదేశీయులు

సాక్షి, విశాఖపట్నం : అంతర్జాతీయ యోగా దినవారోత్సవాలు విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)లో గురువారం ప్రారంభమయ్యాయి. కేంద్ర పోర్టులు నౌకా, జలరవాణా మంత్రిత్వ శాఖ సూచనల మేరకు పోర్టులో యోగా దినోత్సవ సన్నాహక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పోర్టు యాంకరేజ్‌లో ఉన్న విదేశీ నౌకా సిబ్బందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన నౌకా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.



ప్రభుత్వ బడికి క్యూ

- సర్కార్ స్కూళ్లలో అడ్మిషన్ల జోరు
- సీటు కోసం క్యూ కడుతున్న విద్యార్థులు
- విద్యాకానుకతో ఉరకలేస్తున్న ఆనందం
- ప్రవేశాలపై ఫోకస్ పెట్టిన విద్యాశాఖాధికారులు


మొదలైన పాఠ్యాంశాల బోధన

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు జోరందుకున్నాయి. నాడు–నేడుతో మౌలిక సౌకర్యాలు మెరుగుపడటం, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి, నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనతో మెరుగైన ఫలితాలు సాధిస్తుండటంతో సర్కారు బడికి విద్యార్థులు క్యూ కడుతున్నారు. కొత్త విద్యార్థుల రాకతో పాఠశాలలు కళకళలాడుతున్నాయి.

మెరుగైన ఫలితాలతో జోష్

2022–23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయి. ప్రైవేట్, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలోని విద్యార్థులు టాప్ మార్కులు సాధించారు. వీరిని మరింత ప్రోత్సహించే క్రమంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 'ఆణిముత్యాలు'పేరిట ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందించింది. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా ఇదే రీతిన టాప్‌లో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు భారీగానే నగదు పురస్కారాలను అందజేస్తున్నారు. ఇది విద్యార్థుల్లో జోష్ నింపుతోంది. జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, ఆణిముత్యాలు ఇలా అనేక సంక్షేమ పథకాలు అందుతుండటంతో ప్రభుత్వ స్కూళ్లలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

ఆ స్కూళ్లలో అడ్మిషన్ల జోరు

నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. ప్రతీ స్కూల్లో సరిపడా ఉపాధ్యాయుల భర్తీతో పాటు హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండేలా ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల రేషనలైజేషన్, బదిలీల్లో తగిన ప్రాధాన్యమిచ్చారు. ఈ మొత్తం పరిణామాల నేపథ్యంలో జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో గత ఏడాది కంటే అడ్మిషన్లు బాగా పెరుగవచ్చని విద్యాశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. చంద్రపాలెం, తోటగరువు, మల్కాపురం, ఎంజీఎం, గాజువాక, ఎంవీడీ దండుబజార్, మాధవధార, గోపాలపట్నం, పెందుర్తి స్కూళ్లలో అడ్మిషన్ల పెరుగుతుందని అంచనా వేసిన విద్యాశాఖాధికారులు.. అక్కడి ప్రధానోపాధ్యాయులను అప్రమత్తం చేశారు.

కానుక–వేడుక

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాకానుక పంపిణీ ప్రస్తుతం వేడుకలా కొనసాగుతుంది. పాఠశాలలకు వచ్చిన వారందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్నారు. సోమవారం నుంచి నూరు శాతం విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యేలా ఫోకస్ పెట్టారు. మరో పక్క ఆణిముత్యాల పేరుతో విద్యార్థులకు పాఠశాల, నియోజకవర్గ స్థాయిలో ఆర్థిక పురస్కార అందజేత కార్యక్రమంలో కోలాహలంగా సాగుతోంది. అడ్మిషన్లు, మరో పక్క విద్యాకానుక పంపిణీ, ఆణిముత్యాలు అందజేత వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది.


ఈ చిత్రం చూడండి.. నగరంలోని దండుబజార్ జీవీఎంసీ హైస్కూల్‌లో తమ పిల్లలను చేర్పించేందుకు గురువారం తల్లిదండ్రులు క్యూ కట్టారు. నాలుగు రోజుల్లోనే 90 మంది విద్యార్థులు ఇక్కడ కొత్తగా ప్రవేశాలు పొందారు. ఈ పాఠశాలకు సమీపంలోని ప్రైమరీ స్కూల్‌లో 5వ తరగతి పూర్తి చేసిన 200 మందిని తమ పాఠశాలలోనే చేరేలా శ్రద్ధ తీసుకున్నామని, సమీపంలోని ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్ల నుంచి కూడా విద్యార్థులు వచ్చి చేరుతున్నారని దండుబజార్ పాఠశాల హెచ్‌ఎం జనార్దన్‌రావు తెలిపారు. గతేదాది కంటే ఎక్కువగానే అడ్మిషన్లు వస్తాయని భావిస్తున్నట్లు చెప్పారు. ఒక్క దండు బజార్ స్కూల్లోనే కాదు.. జిల్లాలోని చాలా స్కూళ్లలో ఇదే తీరు కొనసాగుతోంది.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య



ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గతేదాది కంటే ఎక్కువ సంఖ్యలో అడ్మిషన్లు చేపట్టేలా ప్రధానోపాధ్యాయులను అప్రమత్తం చేశాం. అడ్మిషన్లు ఎక్కువగా అయ్యే స్కూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉండటం, నాడు–నేడుతో సౌకర్యాలు బాగా మెరుగుపడటంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు.

– గౌరీ శంకర్, డిప్యూటీ డీఈవో

ముస్లింలతో వైఎస్సార్ సీపీకి మరింత బలం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పంచకర్ల, బాబా, రెహమాన్, ఫరూఖీ, బర్కత్ అలీ, సాధిక్, తదితరులు

సాక్షి, విశాఖపట్నం: ప్రతీ ముస్లిం గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రచారం చేయడమే 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్ కే సాత్'కార్యక్రమ ఉద్దేశమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా ఆధ్వర్యంలో ముస్లిం నాయకులతో కలిసి ఈ కార్యక్రమ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో ముస్లింలు కీలకపాత్ర పోషిస్తున్నారని.. వారి కోసం ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో రూ.11,896 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఉర్దూ భాషను ద్వితీయ అధికార భాషగా గుర్తించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. హజ్ యాత్ర నిమిత్తం రూ.14.51 కోట్లు మంజూరు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్క ముస్లిం మనసులో వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని చెప్పారు. వైఎస్సార్ హయాంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు కోసం ప్రత్యేక చట్టం చేసిన ఘనత సీఎం జగన్‌దే అని అన్నారు. జోనల్ విభాగాల ఇన్‌చార్జిలు ఐ.హెచ్ ఫరూఖీ, బర్కత్ అలీ, జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు షరీఫ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు మహమ్మద్ సాధిక్, డైరెక్టర్లు షబీరా బేగమ్, మున్ని, మాజీ డైరెక్టర్ అఫ్రుజా, ముస్లిం నేతలు మఖ్బుల్, బాబ్జీ, ముజీఫ్ ఖాన్, ఇబ్రహీం, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బులియన్

బంగారం (10 గ్రాములు)	
24క్యారెట్:	రూ.59,670
22క్యారెట్:	రూ.54,700
వెండి(కిలో):	రూ.77,500

చికెన్ (కిలో)

ఫారం ధర :	రూ.145
బ్రాయిలర్ (లైవ్):	రూ.165
స్కిన్ :	రూ.300
స్కిన్ లెస్ :	రూ.310

ఏషియన్ బీచ్ వాలీబాల్‌కు కృష్ణంరాజు, నరేష్

విశాఖ స్పోర్ట్స్: ఏషియన్ సీనియర్ బీచ్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌కు భారత్ తరఫున ఏపీ వాలీబాల్ క్రీడాకారులు కృష్ణంరాజు, టి.నరేష్ అర్హత సాధించారు. చైనాలోని ఫుజియన్‌లో ఈనెల 23 నుంచి 26 వరకు పోటీలు జరగనున్నాయి. వీరిద్దరూ కస్టమ్స్, టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌స్పెక్టర్లుగా సేవలందిస్తున్నారు. 26వ ర్యాంక్‌లో కొనసాగుతున్న ఈ జోడి జాతీయ చాంపియన్‌షిప్‌ను సాధించారు. ఈ సందర్భంగా వీరిద్దర్ని వాలీబాల్ సమాఖ్య ఉపాధ్యక్షుడు పివిజిఆర్ నాయుడు అభినందించారు. మొత్తంగా ఈ చాంపియన్‌షిప్‌లో 32 జట్లు పోటీపడుతున్నాయి.

బాలికపై అత్యాచారం

కూర్మన్నపాలెం: ఓ బాలికపై నలుగురు యువకులు అత్యాచారం చేశారు. ఆమె గర్భవతి కావడంతో బాధితురాలి తల్లి పోలీసులను ఆశ్రయించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివీ.. లక్కరాజుపాలేనికి చెందిన బాలిక(15) సమీపంలోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. కొద్ది రోజులుగా బాలిక అనారోగ్యంతో బాధపడుతుండటంతో గర్భ పరీక్ష చేశారు. గర్భవతి అని తేలడంతో తల్లి కుమార్తెను నిలదీసింది. పాఠశాలకు రాకపోకలు సాగించే సమయంలో చిప్పాడ నూకరాజు, గొర్లి సాయికుమార్, నెల్లి మనోజ్, షేక్ అలీ అనే యువకులు ఆమెకు పరిచయ్యారు. వీరు తరచూ బాలికతో ఫోన్‌లో మాట్లాడుతుండేవారు. ఈ క్రమంలో తన కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడ్డారని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. బాలిక తండ్రి గతంలోనే మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిపై పోక్సో, అట్రాసిటీ కేసు నమోదు చేశారు.